

తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు

ఎన్‌సీడీతో ముందస్తు క్యాన్సర్ గుర్తింపు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి
- వైద్య విద్యార్థుల అవగాహన ర్యాలీ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి, పక్కన సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నాగకిషోర్



ర్యాలీగా వెళ్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, జిల్లాలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. గుంటూరు ఒమేగా హాస్పిటల్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ కె.విజయలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తించేందుకు ప్రభుత్వం ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) కార్యక్రమం ద్వారా ఇంటింటికి వైద్య సిబ్బంది ద్వారా ఉచిత పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. ఒమెగా హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎంజీ నాగ కిషోర్ మాట్లాడుతూ క్యాన్సర్‌కు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు, సర్జరీలు అందుబాటులో ఉన్నా యని చెప్పారు. డాక్టర్ పి.గీతా రుక్మిణి మాట్లాడుతూ మహిళలకు, విద్యార్థులకు క్యాన్సర్ సత్వరమే గుర్తించటం వలన చాలా తేలికగా చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భస్థ ముఖద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేశారు. స్క్రీనింగ్ క్యాంపులో 52 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు అమర్తలూరి శ్రావణ్ బాబు, రోహిణి రత్నశ్రీ, అన్నపూర్ణ, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

జీజీహెచ్ నాట్కో సెంటర్‌లో..

ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకొని మంగళవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ సెమినార్ హాల్‌లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకట సుందరాచారి హాజరై మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వల్ల ప్రజలు క్యాన్సర్ లాంటి అనేక దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. వ్యాధుల బారిన పడకుండా ఒత్తిడిని అధిగమించేందుకు యోగా , ధ్యానం చేయాలని సూచించారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలితో ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ తమ సెంటర్‌లో క్యాన్సర్ రోగులకు వైద్యులు, నర్సులు అంకిత భావంతో పనిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు టీబీ శివరామకృష్ణ, వెంకారెడ్డి, మాధురి, అనిల్ కుమార్ నిర్ధారణ, నివారణ, చికిత్స పద్ధతులు గురించి వివరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతుల మురళీకష్ణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మురళీ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయకుమారి పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అపోహలు తొలగిద్దాం

గుంటూరు మెడికల్: వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా గుంటూరు వైద్య కళాశాల వైద్య విద్యార్థులు 'క్యాన్సర్‌ను అరికడదాం' నినాదంతో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. సుమారు 500 మంది వైద్య విద్యార్థులు భారీ ర్యాలీగా గుంటూరు వైద్య కళాశాల నుంచి, జిల్లా కోర్టు మీదగా మార్కెట్ సెంటర్‌కు చేరుకొని వైద్య విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి మాట్లాడుతూ క్యాన్సర్ సోకగానే ఏదో అయిపోతుందనే భయాన్ని ప్రజలు వీడాలని చెప్పారు. ఆధునిక వైద్య చికిత్సలు నేడు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స అందించే పూర్తిగా నివారించవచ్చని పేర్కొన్నారు. అంకాలజిస్ట్ డాక్టర్ బత్తుల అనిల్ కుమార్ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం క్యాన్సర్ రావడానికి కారణమని చెప్పారు. కొన్ని సందర్భాలలో వంశపారంపర్యం వలన క్యాన్సర్ వస్తుందని వివరించారు. ముందుగానే గుర్తించినట్లయితే దానిపై 70శాతం విజయం సాధించినట్లేనని వెల్లడించారు. క్యాన్సర్ రోగిని ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా ఉండేటట్లు చూడటమే ప్రథమ నివారణ అని పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో ప్రదర్శన

గుంటూరు మెడికల్: వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి, నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్ మాట్లాడారు. ర్యాలీలో డాక్టర్లు టీవీ శివరామ కృష్ణ, వెంకారెడ్డి, జ్యోతుల మురళీ, శ్రీనివాస్, జాహ్నవి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయకుమారి , చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.రామారావు పాల్గొన్నారు.

'సలాం నమస్తే' ఆధ్వర్యంలో వ్యాక్సిన్



క్యాన్సర్ వ్యాక్సిన్ వేయించుకున్న వారితో డాక్టర్ షమా సుల్తానా, డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు మెడికల్: ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం 'సలాం నమస్తే గుంటూరు సొసైటీ' చైర్ పర్సన్ డాక్టర్ షమా సుల్తానా ఆధ్వర్యంలో స్థానిక స్టార్ ఫంక్షన్ హాలులో 20 ఏళ్లలోపు వయస్సున్న 64 మంది యువతులకు ఉచితంగా హెచ్‌పీవీ వేశారు. ఈ సందర్భంగా సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ సర్వైకల్ కాన్సర్‌తో పాటు అనేక సమస్య లను నివారించటానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. క్యాన్సర్‌పై అందరిలో అవగాహన పెరిగి టీకాలు వేయించుకునేలా తన సంస్థ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యసేవలు కేవలం పది రూపాయల ఓపీ ఫీజుతో అందిస్తున్నామని చెప్పారు. సీనియర్ జనసేన నాయకుడు చందు సాంబశివ రావు ముఖ్య అతిథిగా పాల్గొని సొసైటీ సేవలను కొనియాడారు. సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ బి.వెంకటేశ్వర రావు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సలాం, డాక్టర్ సునీత, డాక్టర్ సారిక, శేషం సుబ్బారావు, ఎస్. మార్క్, పర్వేజ్ శ్రేష్టి, అమానుల్లా ఖాన్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/13వ అడ్డరోడ్డు ఓంకార క్షేత్రంలోని కుర్తాళం శ్రీసిద్దేశ్వరీ పీఠపాలిత ఓంకార క్షేత్ర ఆవరణలో 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం– 95వ సంఘ వార్షికోత్సవాలు మంగళవారం జరిగాయి. ఉదయం నగర సంకీర్తనతో ప్రారంభించగా, నిత్యపూజలు నిర్వహించారు. కల్యాణాల్లో భాగంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి కళ్యాణం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో చేపట్టారు. రథసప్తమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని సూర్యనారాయణస్వామి వార్లకు అభిషే కార్చనలు విశేషంగా జరిగాయి. కల్యాణం అనంతరం విశేష హారతి, భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ప్రతి రోజు సాయంత్రం మంచికంటి వెంకటసత్య వతి ఆధ్వర్యంలో శ్రీమద్ రామాయణ ప్రవచనం ఉంటుందని కార్యదర్శి తెలిపారు.

దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్‌కు చర్యలు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా..ఉన్న పింఛన్లు పీకేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పింఛన్లను వెరిఫికేషన్ పేరుతో జీజీహెచ్‌కు రావాలంటూ దివ్యాంగులకు నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో చాలా మంది దివ్యాంగులు లబోదిబోమంటూ డాక్టర్లతో పరీక్షలు చేయించుకుంటున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 58,001 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో దివ్యాంగులు(చెవిటి, బ్లైండ్, అంగవైకల్యం, మానసిక వైకల్యం) 6,774 మంది ఉన్నారు. అధికారులు...వీరందరికి 24 గంటల ముందు నోటీసులు అందజేసి జీజీహెచ్‌కు వెళ్లాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు.

ట్రంప్ టారిఫ్‌లను భారత్ తట్టుకుని నిలబడగలగాలి

లక్ష్మీపురం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించనున్న టారిఫ్‌లను భారత్ తట్టుకుని నిలబడ గలిగేలా తగిన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని విద్యావేత్త, విశ్లేషకులు ఎస్.రవిబాబు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ట్రంప్ విధానాలపై మంగళవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అమెరికాతో మైత్రితో ఉంటున్న కెనడా, మెక్సికోలనే ట్రంప్ ఇబ్బంది పెడుతున్నప్పుడు మన దేశాన్ని ఇబ్బంది పెట్టరని అనుకోవద్దన్నారు. అనంతరం సంస్థ సభ్యులు, గాంధేయవాది అచ్చు ఇందుశేఖర్, టి.నారపరెడ్డి, ఆర్.వెంకటరత్నం చర్చలో పాల్గొని ప్రసంగించారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య సభ

లక్ష్మీపురం: క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు.

వర్సిటీలపై అవినీతి ఆరోపణలు ఆందోళనకరం

ఏఎన్‌యూ: డీమ్డ్ వర్సిటీపై అవినీతి ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లవరపు పవన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యా సంస్థల్లోని ఉన్నత స్థాయి ఉద్యోగులు, న్యాక్ బృందంలోని సభ్యులు అవినీతికి పాల్పడం విచారకరమని చెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ ఫీజు తగ్గించాలి



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల సెమిస్టర్ ఫీజు విపరీతంగా పెంచడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సెమిస్టర్ ఫీజు తగ్గించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. పరీక్షల కో ఆర్డినేటర్ శివ ప్రసాద్ ను కలిసి సమస్య విన్నవించారు. వీసీని కలిసిన వారిలో గుంటూరు నగర సంఘటన కార్యదర్శి సాయి, నగర కార్యదర్శి ఈశ్వరలాల్, సంయుక్త కార్యదర్శి నాగ సాయి, వంశీ, శ్రీను, జాస్మిన్, హరిణి, నిఖిత, బాలాజీ, సాత్విక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలని వినతి



నగరంపాలెం: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని విజయవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరిగల శివరాంప్రసాద్ కోరారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో సమావేశమయ్యారు. అనంతరం గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఎనిమిదిన నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. బార్ అసోసియేషన్ల అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి (గుంటూరు), కొత్త చంద్రమౌళి(విజయ వాడ), ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు పి.రవీంద్రకుమార్, జీకే చక్రవర్తి, రాయపూడి శ్రీనివాస్‌రావు, నూనె పవన్‌తేజ, గోగుల నాగిరెడ్డి, సురేష్, తమనం ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

శ్రీవిజయ గణపతిస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎన్‌కాలనీ శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో శ్రీ విజయగణపతి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి సందర్భంగా ఉదయం ఆదిత్యహృదయ పారాయణ జరిగింది. అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అఖండ స్థాపన, రక్షాబంధన, దీక్షాధారణ, అంకురారోపణ వంటి కార్యక్రమాలను వేద పండితులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో దంపతులు పాల్గొనగా, అనంతరం మంత్రపుష్ప నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ పాలకవర్గం ఏర్పాట్లను పర్యవేక్షించగా, నాలుగు రోజులపాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సూర్య నమస్కార పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు సూర్య నమస్కార పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శిరీష మట్లాడుతూ సూర్య నమస్కారాలు, యోగాసనాలు చేయడం ద్వారా జీవితాంతం ఆరోగ్యంగా జీవించగలరని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి కార్యకర్తలు భాస్కర్, సంతోష్, పురంధర్, శేషారావు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ప్రశంసలు పొందిన ఏఎన్‌యూ విద్యార్థులు



ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందిస్తున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రతిష్టాత్మక గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్ దీప్ ధన్ ఖడ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీల ప్రశంసలు పొందడం విశ్వ విద్యాలయానికి గర్వకారణమని వైస్ చాన్సలర్ కె.గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయం నుంచి గణతంత్ర పరేడ్ కు వెళ్లిన ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాల విద్యార్థి ఎం.శిరీష, హిందూ కళాశాల విద్యార్థి సిహెచ్ రిత్విక్ బాబులను మంగళవారం ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి.దివ్య తేజో మూర్తి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థులు వర్సిటీకి వన్నె తెచ్చేలా ప్రదర్శన చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేవీ నిరూపమ, విభాగం సీనియర్ అసిస్టెంట్ కె.కోటేశ్వర రావు, జి.వెంకటేశ్వరరావు, ఎన్. గోపి పాల్గొన్నారు.

నూరు శాతం ట్రేడ్ లైసెన్స్‌లు వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ప్రతి కమర్షియల్ సంస్థకు డీ అండ్ ఓ ట్రేడ్‌లైసెన్స్ ఉండాలని, ఫిబ్రవరి నెలాఖరుకు నూరు శాతం ట్రేడ్ ఫీజులు వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులు, సెక్రటరీలతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుద్ధ్య పనులపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లు ఉండాల్సిన సంఖ్య కన్నా తక్కువగా ఉన్నాయని, ఇన్‌స్పెక్టర్లు తమ డివిజన్ పరిధిలో ప్రస్తుతం ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లు, రెన్యువల్ చేసుకున్నవి, నూతనంగా తీసుకోవాల్సి ఉన్నవాటి వివరాలను, డిమాండ్ నోటీసులను వార్డు సచివాలయాల వారీగా శనివారం నాటికి అందించాలని ఆదేశించారు. తర్వాత క్షేత్ర స్థాయిలో పర్యటనలో ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఎక్కడైనా ట్రేడ్ లైసెన్స్ లేకుండా, ఫీజులు చెల్లించకుండా కమర్షియల్ సంస్థలు ఉంటే సంబంధిత కార్యదర్శిపై, పర్యవేక్షణ అధికారి అయిన ఇన్‌స్పెక్టర్‌పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో పారిశుద్ధ్య విభాగ పనితీరులో మార్పు రావాలని, రోడ్ల మీద వ్యర్థాలు, డెబ్రిస్ తొలగించాలని సూచించారు. ఉదయం మస్టర్ అనంతరం మెయిన్ రోడ్లు శుభ్రం, ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ చేపట్టాలని చెప్పారు. ఇప్పటికే నూతనంగా డంపర్ బిన్లను, పుష్ కార్ట్స్‌ని అందించామని, డివిజన్ల వారీగా అవసరం మేరకు అదనపు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇచ్చామన్నారు. 802 మైక్రో ప్యాకేట్స్ వారీగా మెరుగైన పారిశుద్ధ్యం కోసం కృషి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సూపర్వైజర్ల పేరుతో ఏ ఒక్క ప్రజారోగ్య కార్మికుడు ఉండడానికి వీలులేదన్నారు. ప్రజారోగ్య విభాగం నుంచి అందించే సేవలు నిర్దేశిత గడువులోగా అందించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లపై నివేదిక ఇవ్వాలని శానిటరీ సూపర్‌వైజర్లను ఆదేశించారు. రోడ్ల మీద ఆవులు, ఎద్దులు ఉండడానికి వీలు లేదని, వాటిని పట్టుకొని జీఎంసీ గోశాలకు తరలించాలని ఆదేశించారు. డివిజన్ల వారీగా కార్మికుల హాజరు, లీవుల రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సెలవు చీటీ ఇచ్చిన తర్వాతనే సెలవు మంజూరు చేయాలని కోరారు. ఎంహెచ్‌ఓ, సీఎంహెచ్‌ఓ ప్రజారోగ్య విభాగ పనితీరును ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పనితీరు మెరుగయ్యేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీఎంఓహెచ్‌ఓ డాక్టర్ పీజే అమృతం, వెటర్నరీ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎంహెచ్‌ఓ రవిబాబు, ఏఎంహెచ్‌ఓలు ఆనందకుమార్, రాంబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు ఆయూబ్ ఖాన్, సోమశేఖర్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది



విజేతలతో ఉర్దూ డీఐ ఖాసిం, ఎంఈఓలు రమణయ్య, జ్యోతికిరణ్, గౌసుల్‌మీరా

గుంటూరు ఎడ్యుకేషన్: భూమిపై ప్రాణకోటి మనుగడకు ఆధారమైన చిత్తడి నేలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని పరీక్షా భవన్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ సౌజన్యంతో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరిచుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయిలో క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖాసిం మాట్లాడుతూ భూమిపై ప్రాణికోటి మనగడకు చిత్తడి నేలలే మూలమని, నీటి వనరులకు, తాగునీటికి మూలాలుగా ఉన్న చిత్తడి నేలలు భూమి ఉపరితలం నుంచి వ్యర్థాలను వడపోస్తాయన్నారు. సముద్రం, నది, ఇతర నీటి వనరుల తీర ప్రాంతంలో లోతు తక్కువ ఉండీ ఎక్కువ కాలం నీటి నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారని, మంచి నీటి సరస్సులు, ఉప్పునీటి సరస్సులు, మడ అడవులున్న తీర ప్రాంతాలన్నీ చిత్తడి నేలలేనని అన్నారు. అలల తాకిడికి దెబ్బ తినకుండా ఈ చిత్తడి నేలలు అడ్డు కట్ట వేస్తాయన్నారు. అరుదైన మొక్కలకు, పక్షులకు, జంతువులకు, చేపలు గుడ్లు పెట్టడానికి ఈ చిత్తడి నేలలు చాలా అనుకూలమని తెలిపారు. నీటి నాణ్యతను పెంచడంతోపాటు కాలుష్య కారకాలను గ్రహించడంలో చిత్తడి నేలలు ప్రాధాన్యతను పోషిస్తాయని అన్నారు. అనంతరం ఆయా పోటీల విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, ఎంఈఓలు బీవీ రమణయ్య, జ్యోతి కిరణ్, ప్రధానోపాధ్యాయులు వసుంధర, రాజీవ్ రత్న, రిసోర్స్‌పర్సన్ లు శివశంకర్, అప్పారావు, శాంతిప్రియ, గంగాధర్, మల్లికార్జున రావు, ఏకాంబరేశ్వరరావు, ధనయ్య పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

క్విజ్‌లో నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల, రైలుపేట, జెడ్పీ హైస్కూల్(అంకిరెడ్డిపాలెం), జెడ్పీ హైస్కూల్(నూతక్కి), చిత్రలేఖనంలో వి.వినీత, ఎస్‌జీఎస్‌కేఎంసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గుంటూరు), ఎస్.ధనుష, ఎస్‌కేఎస్ ఎంసీ ఉన్నత పాఠశాల(గుంటూరు), పి. శ్రావణి, ఏపీఆర్ఎస్ మైనారిటీ బాలికల ఉన్నత పాఠశాల(గుంటూరు), వ్యాసరచనలో ఎం. భవిష్య, జెడ్పీ హైస్కూల్(ఉప్పలపాడు), ఎస్‌కే హఫ్సనాజ్, ఎస్‌జేఆర్ఆర్ ఎంసీ ఉన్నత పాఠశాల(గుంటూరు), ఎన్.సిరి, జెడ్పీ హైస్కూల్(నారాకోడూరు) తొలి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో 31వ వార్షికోత్సవ రథసప్తమి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. సూర్య భగవానుని మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ, విశేష పొంగలి నివేదన చేపట్టారు. అరుణపారాయణం, రుద్రహోమం, సామూహిక ఆదిత్య హృదయం, విష్ణు సహస్రనామ పారాయణాలు జరిగాయి. కళ్యాణ వైభవానికి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కె.వి.శ్రీ రంగనాయకి అధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి.. సీతాకల్యాణంపై, డాక్టర్ వేమూరి సత్యవతి.. రుక్మిణీ కల్యాణంపై, డాక్టర్ ఇందిర.. పద్మావతి కళ్యాణంపై ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం తొంభై ఏళ్ల పైబడిన ముగ్గురు సంఘ సేవకులను సత్కరించారు.

పేద విద్యార్థులకు అండగా స్ఫూర్తి ఫౌండేషన్

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



నగరంపాలెం: ప్రస్తుత రోజుల్లో విద్యార్థులపై చేసే ఖర్చు వారి కుటుంబ భవిష్యత్, సమాజాభివృద్ధి, శ్రేయస్సుకు పెట్టుబడి వంటిదని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ అందరికి ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్య ఉచితంగా అందించాలనే మహనీయుల సంకల్పానికి తన వంతుగా ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది గుంటూరు నగరంలో 14 మున్సిపల్, రెండు ప్రభుత్వ పాఠశాలలు, రూరల్‌లో ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ న్యూ మోడల్ టెస్ట్ పేపర్– 2025 పుస్తకాలు ఉచితంగా అందజేసినట్లు వివరించారు.

ఏఐఎస్ఎఫ్ నేత అరెస్ట్ అన్యాయం



లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: అన్నమయ్య జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ ఆపాలని ముఖ్యమంత్రి బహిరంగ సభలో న్యాయమైన డిమాండ్లతో నిరసన తెలిపిన ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్‌ను అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం అన్యాయమని సంఘం జిల్లా కార్యదర్శి యశ్వంత్ పేర్కొన్నారు. అరెస్ట్‌కు నిరసన స్థానిక లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. యశ్వంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక తీరు అధికారంలోకి వచ్చాక ఒక తీరు వ్యవహరించడం సరికాదని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏఎస్ఎఫ్ నాయకులను అడిగి వినతిపత్రాలు ఇప్పించుకున్నారని, ఆయన తనయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మన ప్రభుత్వం వస్తుంది మీరు నేరుగా సమస్యలు మా దృష్టికి తీసుకురావచ్చు అని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులతో కలిసి ప్రెస్ మీట్‌లు పెట్టింది మర్చిపోయి వ్యవహరిస్తున్నారు అని మండిపడ్డారు. చంద్రబాబు నోటికి వచ్చినట్టు మాట్లాడితే విద్యార్థి సంఘాలుగా చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షులు డేవిడ్, సాగర్, కిరణ్, బూమేష్, తేజ, సుమంత్, బాబు, అంకమరాజు పాల్గొన్నారు.

మఖ్దూం మొహియుద్దీన్ చిరస్మరణీయుడు



మఖ్దూం మొహియుద్దీన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో మంగళవారం ఎస్టీయూ ఏపీ వ్యవస్థాపకుడు మఖ్దూం మొహియుద్దీన్ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్టీయూ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, ఉర్దూ కవిగా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులతో పాటు కార్మిక నాయకునిగా మఖ్దూం బహుముఖ బాధ్యతలను నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కెనడీ, జేవీఎస్ ప్రసాద్, వై. శ్యాంబాబు, పి.శ్రీనివాసరావు, సుబ్బారావు, డేవిడ్‌రాజు, దిబ్బయ్య, వెంకయ్య పాల్గొన్నారు.